సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం। 4। మార్చి। 2023



ఎన్నేళ్లు ఇలా..?
ఆహార భద్రత కార్డుల్లో పేర్ల నమోదు కోసం కొత్తగా పెళ్లయిన వారు, వారి పిల్లలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. 8లో



మొక్కులు చెల్లించుకున్నారు..
పగిడిద్దరాజు జాతరలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క హాజరై దేవతలను దర్శించుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
38°/ 19°
వాతావరణం
జిల్లాలో శనివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వాతావరణం మాత్రం చల్లగా ఉంటుది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం, అర్చన వైభవంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన గావించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ నివారణకు చర్యలు

చుంచుపల్లి: జిల్లాలో మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష సిబ్బందికి సూచించారు. జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లతో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ నెల టార్గెట్ మేరకు రక్త నమూనాలు సేకరించాలని, ల్యాబ్ టెక్నీషియన్లు వాటిని సకాలంలో పరీక్షించాలని ఆదేశించారు. ఈ విషయంలో సబ్ యూనిట్ అధికారులు క్షేత్రస్థాయిలో సూపర్‌వైజర్లను మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, హెచ్ఈవో కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో ఖాళీగా ఉన్న 34 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

పోస్టర్లు ఆవిష్కరణ
వాతావరణంలో మార్పుల ద్వారా ఆరోగ్య ప్రభావాలపై ముద్రించిన పోస్టర్లను డీఎంహెచ్‌ఓ శిరీష శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉష్ణ సంబంధిత వ్యాధుల గుర్తింపు, చికిత్సలకు ఈ పోస్టర్‌లో పొందుపరిచిన అంశాల వారీగా శిక్షణ ఇస్తామని తెలిపారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

పాల్వంచ: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 5న పరీక్ష నిర్వహిస్తున్నట్లు నవభారత్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.శాంతకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, డిగ్రీ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందని వివరించారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

అన్నపురెడ్డిపల్లి/చండ్రుగొండ: ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి జి.మరియన్న అన్నారు. అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల్లోని అబ్బుగూడెం, రాజాపురం, కట్టుగూడెం, నామవరం, సీతాయిగూడెం, మద్దుకూరు గ్రామాల్లో గత రెండేళ్లుగా సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలు, డ్రిప్ పరికరాలను ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల నాబార్డ్ ఏజీఎం సుజిత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయిల్‌పామ్ పంట ప్రాముఖ్యత, అంతరపంటలు, ఫెర్టిగేషన్ పద్ధతులు, చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు. అనంతరం సీతాయిగూడెం, బుచ్చన్నగూడెం గ్రామాల్లో గోద్రేజ్ ఆయిల్‌పామ్ నర్సరీని సందర్శించారు. కార్యక్రమంలో అధికారులు సందీప్, విజయకుమార్, డ్రిప్ డీసీఓ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: 2022–23 సంవత్సరానికిగాను దివ్యాంగుల స్వయంఉపాధి, పునరావాసం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి, పునరావాసం కోసం https:tsobmms. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులు నాన్ బ్యాంక్ లింకేజీ మండలానికి ఒక యూనిట్ చొప్పున మొత్తం 30 యూనిట్లకు ఈనెల 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచినట్లు తెలిపారు.

‘డబుల్’ ట్రబుల్



కాసులిస్తేనే ఇళ్లంటూ బేరసారాలు
- రూ.లక్ష ఇస్తే లాటరీలో పేరు
- కౌన్సిలర్లపైనే అవినీతి ఆరోపణలు
- కలకలం రేపుతున్న ఆడియో టేపులు
- క్రమంగా తెరపైకి వస్తున్న మరిన్ని పేర్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ వ్యవహారం గందరగోళంగా మారింది. లబ్ధిదారుల ఎంపికలో లక్షల రూపాయలు చేతులు మారాయంటూ ఆడియో లీకులు, ఆరోపణలు, ధర్నాలు, ఆందోళనలు జరుగుతున్నాయి. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 670 ఇళ్లకు సంబంధించి డ్రా తీయగా సగటున ప్రతీ వార్డుకు 20 వరకు ఇళ్లు కేటాయించారు. ఒక్కో వార్డుకు 20 ఇళ్లు వస్తున్నాయనే సమాచారం అందగానే కొన్నిచోట్ల కౌన్సిలర్లు, మరి కొన్నిచోట్ల వారి కుటుంబ సభ్యులు, అనుచరులు బేరసారాలకు తెరలేపినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ‘లక్ష రూపాయలు చెల్లిస్తే మీ పేరు లాటరీలో వస్తుందని, సకల సౌకర్యాలతో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇల్లు మీ సొంతం అవుతుంద’ని హామీ ఇచ్చారు. వీరి మాటలు నమ్మిన కొందరు రూ.లక్ష సమర్పించగా, మరి కొందరి నుంచి రూ.2 లక్షల వరకు కూడా వసూలు చేశారని సమాచారం.

పేర్ల గల్లంతుతో గందరగోళం..
లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా మొదటి గంట పాటు లాటరీలో వచ్చిన నంబర్లు, పేర్లను అందరికీ బాహాటంగా చూపుతూ ప్రకటన చేశారు. ఆ తర్వాత లాటరీలో వచ్చిన నంబర్లు, పేర్లను లబ్ధిదారులకు చూపించకుండా అధికారులే చదువుకుంటూ పోయారు. వీరిలో కొందరి పేర్లు లాటరీలో రాగా, మరికొందరి పేర్లు గల్లంతయ్యాయి. దీంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. చివరకు ఓ వైపు లాటరీ ప్రక్రియ ముగియకముందే ఆరోపణలు, ఆడియో లీకులు మొదలయ్యాయి.

న్యాయం చేయకుంటే ఆత్మహత్యే..
గురువారం రాత్రి వెలుగులోకి వచ్చిన ఆడియోలో ఓ బాధితుడు పట్టణంలోని కౌన్సిలర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ తనకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని నిలదీశాడు. ‘ఎన్నికల్లో మీ గెలుపు కోసం ఎంతో ప్రయత్నించాం .. మీరు అడిగినంత డబ్బులు అప్పు చేసి మరీ ఇచ్చాం. ఇప్పుడు మా పేరు ఎందుకు లేదు’ అంటూ ప్రశ్నించాడు. దీంతో ‘అందరికీ ఒకేసారి న్యాయం చేయలేను కదా.. మళ్లీ విడతలో మీకు న్యాయం జరుగుతుంది. డబ్బుల విషయం ఇప్పుడు ఎందుకు తీస్తున్నావ్’ అంటూ అవతలి వ్యక్తి బదులిచ్చాడు. అయితే తమకు న్యాయం జరగకుంటే ఆత్మహత్య చేసుకుంటామంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పుడేం చేస్తారో ?
లబ్ధిదారులను లాటరీలో ఎంపిక చేసే సమయంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ‘రూ.ఇరవై లక్షల విలువ చేసే ఇల్లు మీకు ఇస్తున్నా. ఇంటి కోసం ఎవరైనా డబ్బులు లంచంగా ఇస్తే, వాళ్లకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్ చేస్తా ’ అంటూ ధీమాగా ప్రకటించారు. అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ప్రకటించిన గంటల వ్యవధిలోనే అవినీతి ఆరోపణలు, లంచాల వ్యవహారంతో డబుల్ కాస్తా ట్రబుల్‌గా మారింది. ప్రస్తుత పరిస్థితులపై ఎమ్మెల్యే వనమా తన మాటకు కట్టుబడి ఉంటారా ? అనేది ఆసక్తిగా మారింది. లంచాలు ఇచ్చిన, తీసుకున్న వారిపై విచారణ జరిపిస్తారా ? ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది చర్చనీయాంశం అయింది.

ఆడియోల్లో వెల్లువెత్తిన ఆరోపణలు..
ఆడియో లీక్ తర్వాత కౌన్సిలర్లపై ఒక్కొక్కటిగా ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఒక కౌన్సిలర్ కుటుంబంలో ఇద్దరికి, వాళ్లింట్లో పని చేసే మరో ఇద్దరికి లాటరీలో ఇళ్లు వచ్చాయి. ఓ మహిళా కౌన్సిలర్‌కు డబ్బులిచ్చిన వ్యక్తి తమకు ఇల్లు ఎందుకు రాలేదని ప్రశ్నించగా.. మరో కౌన్సిలర్ జోక్యం చేసుకుని ‘మీ కోసం ప్రయత్నించాం.. పని కాలేదు.. ఓపిక పట్టు.. లేదంటే నీ దిక్కున్న చోట చెప్పుకో.. మాకు ఏమీ కాదు. మాతో పెట్టుకుంటే భవిష్యత్‌లో నీకు ఇల్లే రాకుండా చేస్తాం’ అంటూ కస్సుమన్నాడు. ప్యూన్ బస్తీలో అప్పటికే ఇళ్లు ఉండి, ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న ఒక కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు ఇళ్లు లాటరీలో వచ్చాయి. ఇలా తహసీల్దార్ కార్యాలయం వేదికగా వీరు మంత్రాంగం నడిపినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

‘గూడెం’ తహసీల్దార్ బదిలీ

‘డబుల్’లో చేతివాటమే కారణమా ?

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం తహసీల్దార్ పి.వి.రామకృష్ణను బదిలీ చేస్తూ కలెక్టర్ అనుదీప్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లో నాయబ్ తహసీల్దారుగా పని చేస్తున్న జీ.ఎస్.కె.శర్మను కొత్తగూడెం తహసీల్దార్‌గా నియమించారు. బదిలీ అయిన రామకృష్ణను కలెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అయితే డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి లాటరీ ప్రక్రియ జరిగే ముందురోజు రాత్రి కొత్తగూడెం తహసీల్దారు కార్యాలయానికి వార్డు కౌన్సిలర్లు కొన్ని పేర్లతో జాబితా అప్పగించగా, ఆ జాబితాలోని పేర్లు లాటరీలో వచ్చాయి. అయితే కౌన్సిలర్లు సదరు లబ్ధిదారుల నుంచి డబ్బు వసూలు చేసి అందులో కొంత తహసీల్దార్‌కు ముట్టజెప్పారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాటుగా తహసీల్దార్‌ను నేరుగా కొంతమంది వ్యక్తులు కలిసి తమ పేర్లు లాటరీలో వచ్చేందుకు గానూ డబ్బులు ముట్టజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో కూడా వార్డు కౌన్సిలర్లు, లబ్ధిదారులకు మధ్య జరిగిన డబ్బుల ఒప్పంద సంభాషణలు, వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి.

పట్టాల ప్రక్రియలోనూ ఇదే తంతు..
కొత్తగూడెంలో క్రమబద్ధీకరణ ప్రక్రియకు సంబంధించి మొదటి నుంచి అవినీతి ఆరోపణలున్నాయి. దీంతో గత రెండేళ్ల క్రితం తహసీల్దార్ల బదిలీలు జరిగిన అనంతరం కొత్తగూడెం తహసీల్దార్‌గా రామకృష్ణ వచ్చారు. ఆ తర్వాత క్రమబద్ధీకరణ పట్టాల జారీ విషయంలోనూ ఆయన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు.

‘సువర్ణ’ వాహనాలకు
ప్రతిష్ఠా మహోత్సవం



స్వర్ణ తాపడ వాహనాలపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహిస్తున్న భక్తులు, అర్చకులు

- చిత్రకూట మండపంలో ప్రత్యేక పూజలు
- వాహనాలతో స్వామివారికి ఘనంగా తిరువీధి సేవ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి ప్రవాసాంధ్ర వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.65 లక్షల వ్యయంతో తయారుచేయించిన సువర్ణ తాపడ ద్వాదశ వాహనాలకు శుక్రవారం వైభవోపేతంగా ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించారు. తమిళనాడు నుంచి వచ్చిన ఈ వాహనాలను చిత్రకూట మండపంలో కొలువుదీర్చి గురువారం అంకురార్పణ చేసిన విషయం తెలిసిందే. ఆ వాహనాలపై సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్రస్వామి వారి ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం రక్షాబంధనం, జలాధివాసం, క్షీరాధివాసం, ప్రాణ ప్రతిష్ఠ, కుంభ ప్రోక్షణ, మహా పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. గజ, అశ్వ, చంద్రప్రభ, సూర్యప్రభ, గరుడ, శేష, హనుమత్, కల్పవృక్ష, హంస, సింహ, సార్వభౌమ వాహనాలలో ఆశీనులైన స్వామి వారికి భక్తులు జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నాడు భక్త రామదాసు చేయించిన వాహనాలతోనే స్వామివార్లకు ఉత్సవాలను నిర్వహించామని తెలిపారు. ప్రవాసాంధ్ర దాతలు స్వామివారిపై భక్తితో తయారు చేయించిన సువర్ణ పూత వాహనాలతోనే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం తదితర కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు. అనంతరం వాహనాల దాతలను దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రసాదం అందజేశారు. సాయంత్రం ద్వాదశ వాహనాలతో తాతగుడి సెంటర్ వరకు మేళతాళాలు, వేద మంత్రోచ్చరణలు, శ్రీరామ నామస్మరణల నడుమ నూతన వాహనాలతో స్వామివార్లకు తిరువీధి సేవ నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారికి సార్వభౌమ సేవ జరపనున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది, దాతలు రంగారావు, సునీత బృందం, ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్ఎల్ కాంతారావు, చారుగుళ్ల శ్రీనివాస్, ఎస్ఎన్వీ రామారావు, జి.వెంకటాచార్యులు, బండారి కృష్ణయ్య, యశోద రాంబాబు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకవచధారుడైన రామయ్య..
భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం దర్బారు సేవ నిర్వహించారు.



స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు



‘స్వర్ణ’ వాహనాలపై స్వామివారు..

అనర్హులకు కేటాయిస్తే ఫిర్యాదు చేయండి

కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అనర్హులకు లబ్ధి చేకూరితే వారి వివరాలతో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ అనుదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా వీడియోగ్రఫీ తీయించామని, కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయంలో తయారుచేసిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే అదనపు కలెక్టర్ (9392919700), జిల్లా రెవెన్యూ అధికారి(9392919702) నంబర్లకు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. తమ విచారణలో వాస్తవమని తేలితే వారి పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.



రేగా కాంతారావుతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్‌తో విప్ రేగా భేటీ
ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కలెక్టర్ అనుదీప్‌తో శుక్రవారం సమావేశమయ్యారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై చర్చించారు.

కూలీ మరణంపై వీడని మిస్టరీ !

- ‘రైస్ మిల్లు’ ఘటనలో ఫిర్యాదు రాలేదంటూ పోలీసుల సైలెంట్
- పది రోజులుగా జాడ లేని ఇటుక బట్టీ కూలీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ‘అందరూ శాకాహారులే.. రొయ్యల గంప మాయం’ అన్నట్టుగా మారింది రైస్‌మిల్లులో కూలీ మరణం కేసు. సుజాతనగర్ మండలంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించని ఓ రెస్‌మిల్లులో బాయిలర్ నుంచి వేడి బూడిద పడి చండ్రుగొండ మండలం మద్దుకూరుకు చెందిన ఓ ఇటుక బట్టీ కూలీ మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారనే ప్రచారం జరుగుతోంది. అయితే దుర్ఘటన జరిగిన వెంటనే విషయం బయటకు పొక్కకుండా మిల్లు యాజమాన్యం మృతుడు, బాధితుల కుటుంబాలతో ఒప్పందం చేసుకుంది. కాగా, వారి అంచనాలు తారుమారై చివరకు ఈ విషయం బయటకు పొక్కింది. రైస్ మిల్లు ప్రమాదానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందని కారణంగా తాము ఏమీ చేయలేమని సుజాతనగర్ పోలీసులు స్పష్టం చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడలేదు. మొత్తానికి కూలీ మరణంపై ఫిర్యాదు రాలేదు కాబట్టి తాము విచారణ చేయడం లేదని కార్మిక, పోలీస్, రెవెన్యూ శాఖలు స్పష్టం చేశాయి. అయితే రైస్‌మిల్లులో మరణించినట్టుగా ప్రచారం జరుగుతున్న చండ్రుగొండ మండలం మద్దుకూరుకు చెందిన 32 ఏళ్ల ఇటుక బట్టీ కూలీ ఎక్కడున్నాడు ? గత పది రోజులుగా అతను ఎందుకు అదృశ్యమయ్యాడు ? అతని ఆచూకీ లభించకపోవడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ప్రమాదం చోటు చేసుకున్న రైస్‌మిల్లులో భద్రతా ప్రమాణాలు, రక్షణ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? భవిష్యత్తులో మరొకరికి ఇలా జరిగితే ఏంటనే అంశాలపై ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మృతుల కుటుంబాలకు చెక్కులు

కొత్తగూడెంటౌన్/ఇల్లెందు: పోలీసు శాఖలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం చెక్కులు అందజేశారు. ఇల్లెందులో విధులు నిర్వహిస్తూ గతేడాది రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ కల్తీ వీరభద్రం భార్య, సుదిమళ్ల సర్పంచ్ కల్తీ పద్మకు రూ.26 లక్షల చెక్కును అందించారు. అలాగే పాల్వంచ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తూ అనారోగ్యంతో మరణించిన శ్యాంసన్ కుటుంబానికి చేయూత ఫండ్ నుంచి రూ.లక్ష, మణుగూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన కానిస్టేబుల్ రవీందర్ కుటుంబానికి కార్ప్స్ ఫండ్ రూ.60 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం విధులలో నిమగ్నమై ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సూపరింటెండెంట్ సత్యవతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ వినీత్ చేతులమీదుగా చెక్కు అందుకుంటున్న కల్తీ పద్మ

ఇంటర్ పరీక్షలకు 35 కేంద్రాలు

- విద్యార్థుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల కోసం జిల్లాలో 35 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఐడీఓసీ సమావేశ హాలులో శుక్రవారం ఆయన ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 10,363 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9,504 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులకు సలహాలు, సూచనల కోసం 9490969965, 7997994366 నంబర్లతో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి చీఫ్ సూపరింటెండెంట్ రూంలో సీసీ కెమెరా అమర్చాలని సూచించారు. 12 ప్రైవేట్ కళాశాలల కేంద్రాలకు 12 మంది అదనపు చీఫ్ సూపరింటెండెంట్లు విధులు నిర్వహిస్తారని, 16 పోలీస్‌స్టేషన్లలో పరీక్ష పత్రాలను భద్రపర్చనున్నామని వివరించారు. 35 మంది చీఫ్ సూపరింటెండెట్లు, 35 మంది శాఖాపరమైన అధికారులు విధులు నిర్వహిస్తారని చెప్పారు. మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఐదు కస్టోడియన్లను నియమిస్తున్నట్లు తెలిపారు. 520 మంది ఇన్విజిలేటర్లకు విధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని సూచించారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సులోచనారాణి, ఉప వైద్యాధికారి డాక్టర్ సుకృత, సీఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఏడీఎంహెచ్‌ఓగా దయానందస్వామి

భద్రాచలం: అడిషనల్ డీఎంహెచ్‌ఓ(ట్రైబల్)గా డాక్టర్ దయానందస్వామి తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కొద్ది రోజుల క్రితం కొత్తగూడెం మెడికల్ కళాశాల ఆర్ఎంఓగా బాధ్యతలు అప్పగించారు. దీంతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష అడిషనల్ డీఎంహెచ్‌ఓ బాధ్యతలను సైతం నిర్వర్తించారు. అయితే దీనిపై దయానందస్వామి హైకోర్టును ఆశ్రయించి అడిషనల్ డీఎంహెచ్‌ఓగా తనకు అర్హత ఉందంటూ ఉత్తర్వులు తెచ్చుకుని తిరిగి విధుల్లో జాయిన్ అయ్యారు. దీంతో అడిషనల్ డీఎంహెచ్‌ఓగా బాధ్యతలను నిర్వహిస్తూనే మెడికల్ కళాశాలకు ఇన్‌చార్జ్ ఆర్ఎంఓగా వ్యవహరించనున్నారు.



ఇల్లెందులో కట్టెల పొయ్యిపై టీ కాస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

హోరెత్తిన నిరసనలు..

గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్, వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. మణుగూరులో విప్ రేగా కాంతారావు, అశ్వారావుపేట, ఇల్లెందులో ఆయా ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ ఆధ్వర్యంలో ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా, న్యూడెమోక్రసీ కార్యకర్తలు సైతం వేర్వేరుగా ఆందోళన బాట పట్టారు. 9లో

క్లుప్తంగా

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న గ్రామపెద్దలు

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ మేడికుంట గ్రామంలో మూడు రోజులపాటు ఏడు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బయ్యారం మండలం చెరువు కొత్తగూడెం, టేకులపల్లి మండలం ఎర్రాయిగూడెం జట్ల మధ్య శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరగ్గా, చెరువు కొత్తగూడెం జట్టు విజేతగా నిలిచింది. రెండో, మూడో, నాలుగో స్థానాల్లో ఎర్రాయిగూడెం జట్టు, బయ్యారం మండలం నర్సాపురం జట్టు, మేడికుంట జట్టు నిలిచాయి. అనంతరం విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మూతి కృష్ణ, ఎంపీటీసీలు మండల రాము మహేష్, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, సర్పంచ్ కుంజ కృష్ణ, ఉపసర్పంచ్‌లు రామకృష్ణ, తాటి రాంబాబు, తాటిబిక్షం, సూర్నపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమికొడదాం

సుజాతనగర్: విదేశాల నుంచి వచ్చిన ర్యాగింగ్ భూతాన్ని కూకటివేళ్లతో పెకిలిద్దామని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. ధన్వంతరి కళాశాలలో ఎంబీఏ, ఫార్మసీ విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్‌పై అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐ రమాకాంత్, ఎస్‌ఐ పి.తిరుపతిరావు, ఎంబీఏ ప్రిన్సిపాల్ ఎస్.రామకోటేశ్వరావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ జి.నాగరాజు, ఏఎస్‌ఐ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

చుంచుపల్లి: జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత శుక్రవారం చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి తండా, నందాతండా, బాబు క్యాంప్ గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు, సిబ్బందితో మాట్లాడి హాజరు, తదితర వివరాలు తెలుసుకున్నారు. ఉపాధి పనులకు ఎక్కువమంది హాజరయ్యేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ ఎస్.రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, ఏపీఓ రఘుపతి, ఈసీలు నాగరాజు, ఆస్మా చుంచుపల్లి తండా సర్పంచ్ మాలోత్ ధనలక్ష్మి, నందతండా సర్పంచ్ మాలోత్ లక్ష్మి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబూరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచాలని మాజీ ఎంపీ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న దీక్షలు రెండో రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఐసీడీఎస్‌ను ప్రభుత్వ శాఖగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేయాలని, చట్టబద్ధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, నాయకులు బి.రాజు, వీరభద్రం, సుల్తానా, పద్మ, వెంకటమ్మ, గద్దల శ్రీను, పిట్టల అర్జున్, డి.వీరన్న, కె.సత్య, దొడ్డ రవికుమార్, భూక్య రమేష్, కాంతారావు, వెంకట్ పాల్గొన్నారు.

పశుసంవర్ధక ఉద్యోగుల సంఘం ఎన్నిక

సూపర్‌బజార్(కొత్తగూడెం): పశు సంవర్ధక శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కె.రవికుమార్, ఉపాధ్యక్షురాలిగా జి.అచ్చమ్మ, కార్యదర్శిగా ఎం.వెంకటరమణారావు, కోశాధికారిగా కె.శ్రీను, సహాయ కార్యదర్శులుగా మనోజ్ఞ, డి.గణేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పి.శ్వేత, లక్ష్మి, ముంతాజ్, ఎం.దేవేందర్ రాజు ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

అశ్వారావుపేట: అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు చాపర నారాయణ(42) అక్కడికక్కడే మృతి చెందాడు. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం గ్రామానికి చెందిన నారాయణ బుట్టాయిగూడెంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అశ్వారావుపేట నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రెహమాన్ తెలిపారు.

ఎన్నేళ్లు ఇలా..?

రేషన్ కార్డుల్లో కొత్త పేర్ల చేర్పు మాటే లేదు...

- వివాహమైనా, బిడ్డ పుట్టినా... అంతే సంగతులు
- జిల్లాలో ఇప్పటికే 34,967 దరఖాస్తులు పెండింగ్
- ఆన్‌లైన్ నిలిచిపోవడంతో పలువురి ఎదురుచూపులు



రేషన్‌కార్డులు (ఫైల్)

అశ్వాపురం: ఆహార భద్రత కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. కొత్తగా వివాహం చేసుకున్న వారివి, కుటుంబ సభ్యుల్లో పిల్లల పేర్లు నమోదు చేసేందుకు దరఖాస్తుదారులు నిరీక్షణ తప్పడంలేదు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు పేర్లు నమోదు కావాల్సి ఉన్నా.. ప్రభుత్వం మాత్రం పేర్ల నమోదు ప్రక్రియ చేపట్టడంలేదు. దీంతో అర్హులు రేషన్‌కు దూరమవుతున్నారు.

34,967 దరఖాస్తులు పెండింగ్

ఆహార భద్రతకార్డుల్లో ఓ ప్రాంతంలో తన పేరు తొలగించి మరోచోట నమోదు చేయాలని దరఖాస్తు చేస్తే.. రెవెన్యూ అధికారులు నెల రోజుల్లోనే పేర్లను తొలగిస్తున్నారు. కానీ మరో చోట మాత్రం ఏళ్లు గడిచినా పేర్లు నమోదు చేయడంలేదు. కొత్తగా వివాహం చేసుకున్న మహిళలు తమ పుట్టింటి కార్డులో పేరు తొలగించాక.. భర్త కార్డులో పేరు నమోదు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. భార్యాభర్తల పేర్లు కార్డుల్లో ఉండి పిల్లల పేర్లు నమోదు కాక ఎందరో అనేకమంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆహార భద్రత కార్డుల్లో చేర్పులు మార్పుల కోసం జిల్లా వ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 34,967 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో అవన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

ప్రభుత్వ పథకాలు అందక...

జిల్లాలో ఆహార భద్రత కార్డుల్లో పలువురు దరఖాస్తుదారులకు సంబంధించి భార్య, పిల్లల పేర్లు నమోదు కాలేదు. దీంతో కుటుంబంలో అర్హులు ముగ్గురు, నలుగురు ఉన్నప్పటికీ రేషన్ మాత్రం ఒక్కరు, ఇద్దరికే వస్తోంది. మిగిలినవారికి రేషన్ అందడం లేదు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నిరుపేదలు రేషన్ బియ్యంపైనే ఆధారపడుతుండటంతో ఆయా కుటుంబాలకు ఇబ్బందులు తప్పడంలేదు. రేషన్‌కార్డుల్లో పేర్లు లేక ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలు కూడా దూరమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆహార భద్రతకార్డుల్లో పేర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



ఈమె పేరు తోట కల్యాణి. అశ్వాపురంలోని బుడుగుబజార్. భర్త లేడు. ఇద్దరు పిల్లలు హర్షవర్ధన్(10), రిషివర్ధన్(8) పేర్లు ఆహార భద్రతకార్డులో నమోదు చేయాలని మీ సేవ కేంద్రంలో రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసింది. కానీ ఇప్పటివరకు నమోదు కాలేదు. దీంతో రేషన్ దుకాణంలో ఆమె ఒక్క పేరుమీదే బియ్యం ఇస్తుండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. రేషన్‌కార్డులో పేరు లేకపోతే పిల్లలు పైచదువులకు వెళ్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈమెలాగే వేల మంది కార్డుల్లో కుటుంబ సభ్యుల్లో పేర్లు నమోదు కాక ఎదురు చూస్తున్నారు.

రెండు సార్లు దరఖాస్తు చేశా...



రేషన్‌కార్డులో నా పేరు మాత్రమే ఉంది. నా భార్య, ఇద్దరు పిల్లలు పేర్లు నమోదు చేయాలని నాలుగు ఏళ్ల క్రితం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేశా. మళ్లీ మూడు నెలల క్రితం దరఖాస్తు చేశాను. అయినా కార్డులో పేర్లు చేర్చలేదు. ప్రభుత్వం స్పందించి ఆహార భద్రత కార్డుల్లో చేర్పులు, మార్పులు చేపట్టాలి.

– షేక్ అజీజ్, గొందిగూడెం, అశ్వాపురం మండలం

ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే..



జిల్లాలో ఆహార భద్రత కార్డుల్లో పేర్ల నమోదుకు సంబంధించి 34,967 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కొత్త పేర్లు నమోదు చేస్తాం.

– ఎం.మల్లికార్జున్‌బాబు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

మొక్కులు అప్పజెప్పిన ఆదివాసీలు

- మూడో రోజుకు చేరిన పగిడిద్దరాజు జాతర
- వేడుకలకు హాజరైన ములుగు ఎమ్మెల్యే సీతక్క



మొక్కులు చెల్లించుకుంటున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క

గుండాల: పగిడిద్దరాజు జాతరలో భక్తులు శుక్రవారం మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెనెక్కిన పగిడిద్దరాజు, సమ్మక్క దేవతలకు శుక్రవారం తెల్లవారు జామునుంచి ఆలయ పూజారులు, వడ్డెలు అరెం వంశీయుల ఆచార సంప్రదాయాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున శ్రేల పెయ్యను నైవేద్యంగా అందించారు. మూడు రోజులుగా సాగుతున్న జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకా ఇతర మండలాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

జాతరలో పాల్గొన్న ములుగు ఎమ్మెల్యే సీతక్క

గుండాల మండలం యాపలగడ్డ గ్రామంలో జరుగుతున్న పగిడిద్దరాజు జాతరలో ములుగు ఎమ్మెల్యే సీతక్క దేవతలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరెం అప్పయ్య, నాగయ్య, లక్ష్మీనర్సు, కాంతారావు, బిక్షం, సత్యం, సమ్మయ్య, చిన్న కాంతారావు, రామారావు, లచ్చుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లిలో..

గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడు పంచాయతీ పెద్దూరు గ్రామంలో జరుగుతున్న కొమరం వంశీయుల ఇలవేల్పు రెక్కల రామక్క జాతర మూడో రోజుకు చేరింది. శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించారు. తమ కుటుంబాలను ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో, సుఖ సంతోషాలతో సల్లంగ చూడమ్మా అంటూ వేడుకున్నారు. ఆళ్లపల్లి, గుండాల మండలంతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఒకే నంబర్‌తో రెండు లారీలు..

అక్రమంగా బొగ్గు తరలించేందుకు యత్నం

సింగరేణి(కొత్తగూడెం): ఒకే ఎల్‌ఎంసీ నంబర్‌తో బొగ్గు తరలించేందుకు యత్నించిన రెండు లారీలను సింగరేణి విజిలెన్స్ అధికారులు పట్టుకున్న విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి కథనం ప్రకారం.. సింగరేణిలో వినియోగదారులకు లారీ మూవ్‌మెంట్ కార్డ్ (ఎల్‌ఎంసీ) ద్వారా బొగ్గు సరఫరా చేస్తారు. ఈ నేపథ్యంలో గత నెల 28న రుద్రంపూర్‌కు చెందిన లారీ ఓనర్ కమ్ డ్రైవర్ ఒకే నంబర్‌తో సీహెచ్‌పీలో ఒక లారీ, సత్తుపల్లిలోని కిష్టారం సీహెచ్‌పీలో మరో లారీ పెట్టి లోడ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ ఉద్యోగి సమాచారం ఇవ్వడంతో విజిలెన్స్ అధికారులు వచ్చి పట్టుకున్నారు. ఆ రోజు విధుల్లో ఉన్న గార్డు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అతన్ని సస్పెండ్ చేశారు. ఒకే ఎల్‌ఎంసీ నంబర్‌తో ఇద్దరు అన్నదమ్ములు బొగ్గు అక్రమ రవాణాకు యత్నించినట్లు సమాచారం. కాగా ఈ ఘటనపై లోతుగా విచారణ చేపట్టినట్లు సింగరేణి అధికారులు తెలిపారు.

అర్ధరాత్రి ఆదివాసీల ఆందోళన

పోలీసులు, గిరిజనులకు మధ్య వాగ్వాదం



గుడిసెల వద్దకు వెళ్లే రోడ్డులో పెట్టిన మంట..

భద్రాచలం టౌన్ : భద్రాచలం శివారు ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఆదివాసీలకు పోలీసులకు నడుమ వాగ్వాదం చోటు చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కొద్ది రోజుల క్రితం భద్రాచలం శివారు ప్రాంతాల్లో వివిధ ప్రాంతాల ఆదివాసీలు ఖాళీ ప్రదేశాల్లో గుడిసెలు వేసుకొని, ఇళ్ల జాగాకు హక్కు పత్రాలు ఇప్పించాలంటూ కోరుతున్నారు. అయితే ఆ స్థలాల యజమానులు హైకోర్టు నుంచి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తీసుకుని రావడంతో పోలీసులు గురువారం ఉదయం ఆ స్థలాల్లో ఉన్న గుడిసెలను తొలగించి హైకోర్టు ఆదేశాలకు సహకరించాలని కోరారు. ఉన్నట్లుండి శుక్రవారం అర్ధరాత్రి ఆ ఖాళీ ప్రదేశంలోని ఓ గుడిసెకు మంటలు అంటుకున్నాయి. దీంతో పోలీసులే ఆ గుడిసెకు మంటలంటించారని, ఓ వృద్ధురాలు సజీవ దహనం అయిందని ఆరోపిస్తూ ఆదివాసీలు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆదివాసీలకు నడుమ గొడవ చోటు చేసుకుంది. ఆదివాసీలు అర్ధరాత్రి చీకట్లోనే బైఠాయించి ఐటీడీఏ పీఓ, తహసీల్దార్ వచ్చి తమకు సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు. సీఐ నాగరాజు రెడ్డి ఆందోళనకారులతో మాట్లాడుతూ.. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, అందుకు సహకరించాలని కోరారు. ఆందోళన విరమించి కోర్టు ద్వారా న్యాయం కోసం ప్రయతించాలని సర్ది చెప్పారు. అయినా ఆదివాసీలు శాంతించలేదు. అంతా చీకటిగా ఉండటంతో అక్కడ ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

కేజీబీవీని సందర్శించిన వైద్య బృందం



విద్యార్థినులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

చర్ల: మండల కేంద్రంలోని లక్ష్మీకాలనీలో ఉన్న కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం వైద్యబృందం సందర్శించింది. గురువారం కేజీబీవీలో 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయమై విదితమే. దీంతో కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్, సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే వైద్యబృందం సభ్యులు భోజన పదార్థాలను పరిశీలించారు. అస్వస్థతకు గురై కోలుకున్న బాలికలతో మాట్లాడి వివరాలు సేకరించారు. మరో రెండు వారాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థినులు మానసికంగా ఆందోళనకు గురవుతూ సరిపడా హారం తీసుకోకపోవడం, సమయానుకూలంగా నిద్ర పోకపోవడం వల్లే ఇలా జరిగి ఉంటుందని వైద్యాధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. విద్యార్థులందరికీ త్వరలోనే రక్త పరీక్షలు నిర్వహించి లోపాన్ని గుర్తిస్తామని వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. డాక్టర్ శిరీష, హెచ్‌ఈఓ వేణు, హెచ్‌వీ వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.

భర్త, అత్తామామలపై కేసు నమోదు

పాల్వంచరూరల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తామామలపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కోడిపుంజుల వాగు గ్రామానికి చెందిన భూక్యా స్వప్నను భర్త బాలాజీ, అత్త, మామలు కొద్దిరోజులుగా అదనపు కట్నం తేవాలని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.శ్రీనివాస్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కొత్తగూడెంరూరల్: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీదేవిపల్లి పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పునుకుడుచెలక గ్రామానికి చెందిన మడకం వసంతరావు(28) మద్యానికి బానిసయ్యాడు. భార్య గర్భిణి కావడంతో పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గత నెల 25న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆస్పత్రి నుంచి డిశార్చ్ చేశాక ఇంటికి తీసుకెళ్లారు. కాగా వసంతరావు మళ్లీ గురువారం పురుగుల మందు తాగి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు మడకం శ్రీను శుక్రవారం ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు.

7న రేషన్ బియ్యం వేలం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 7న ఉదయం 11 గంటలకు రూ.1,98,900 విలువైన 132.60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యానికి బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ధర రాని పక్షంలో వేలంపాటను రద్దు చేస్తామని పేర్కొన్నారు. వేలంపాట పాడినవారు నగదు మొత్తాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

మావోయిస్టుల అరెస్ట్

పోలీసుల అదుపులో ఇద్దరు దళ సభ్యులతోపాటు సానుభూతిపరుడు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు దళ సభ్యులు, మరో సానుభూతిపరుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఎస్పీ డాక్టర్ వినీత్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్ర సరిహద్దు గ్రామమైన పైడిగూడెం అటవీ ప్రాంతంలో దుమ్ముగూడెం పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ 212 బెటాలియన్, 141 బెటాలియన్ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పామేడు దళ సభ్యులుగా పనిచేస్తున్న సోడి కామే, సోడి బందు, సానుభూతిపరుడు సోడి చంటిని అరెస్ట్ చేశారు. విచారించగా మావోయిస్టు అగ్రనేతల ఆదేశాల మేరకు పోలీసులను చంపాలనే ఉద్దేశంతో ల్యాండ్ మైన్ ఏర్పాటుకు పైడిగూడెం అటవీ ప్రాంతంలోకి వచ్చినట్లు నిందితులు అంగీకరించారు. వీరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కామారం ప్రాంతానికి చెందినవారు. కామే, బందు ఐదేళ్లుగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన పలు ఘటనల్లో పాలుపంచుకున్నారు. వీరిపై చర్ల, దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్లలో ఒక్కో కేసుతోపాటు ఛత్తీస్‌గఢ్‌లో కూడా కేసులు నమోదయ్యాయి. చంటి సానుభూతిపరుడిగా పనిచేస్తున్నాడు. వారి నుంచి 10 జిలెటిన్ స్టిక్స్, 4 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 20 మీటర్ల కార్డెక్స్ వైరు, 50 మీటర్ల ఎలక్ట్రిక్ వైరు, బ్యాటరీ స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్ పాల్గొన్నారు.

సింగరేణి మ్యాగ్జిన్ సమీపంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేసేందుకు వచ్చిన సింగరేణి రెస్క్యూ సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని సింగరేణి ఎక్స్‌ప్లోజివ్ మ్యాగ్జిన్ సమీపంలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. పేలుడు పదార్థాలు ఉండే మ్యాగ్జిన్ చుట్టుపక్కల చెత్తాచెదారానికి నిప్పంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. సమయానికి రెస్క్యూ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. ఎక్స్‌ప్లోజివ్స్ నిల్వ ఉన్న ప్రదేశంలో చుట్టుపక్కల 100మీటర్ల వరకు చెత్తాచెదారం లేకుండా యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఏరియా అధికారులు నిర్లక్ష్యంతో జాగ్రత్తలు తీసుకోవడం లేదని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు ఆరోపించారు. త్రుటిలో భారీ ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. జిల్లాలోని జీకే ఓసీ, పీవీకే-5 గనికి, ఇల్లెందు, కోయగూడెం, మణుగూరు ఓసీలతోపాటు సత్తుపల్లి ఓసీకి కూడా ఇక్కడి నుంచే పేలుడు పదార్థాలు సరఫరా అవుతాయని, ఇప్పటికైనా అధికారులు మేల్కొని తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

పామాయిల్ తోట దగ్ధం

టేకులపల్లి: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు చెలరేగి సంపత్‌నగర్‌కు చెందిన రైతు మాలోత్ హేమ్లా నాయక్ పామాయిల్ తోట శుక్రవారం దగ్ధమైంది. ఏడెకరాల్లో తోట సాగు చేస్తుండగా, ఐదెకరాల్లో తోట, డ్రిప్ పైపులు కాలిపోయాయని, రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పోక్సో కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: మైనర్‌గా ఉన్న సమయంలో ప్రేమ, పెళ్లి పేరుతో లొంగదీసుకుని లైంగికంగా వాడుకుని, మేజర్ అయిన తరువాత కూడా పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కూలీలైన్‌కు చెందిన ప్రైవేటు టీచర్ వడ్డె కీర్తికి తన తల్లి నర్సుగా పనిచేస్తున్న ఆస్పత్రిలో పానుగంటి గోపినాథ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. దీంతో అతను ప్రేమిస్తున్నానంటూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని కీర్తి కోరగా నిరాకరించడంతోపాటు మళ్లీ అడిగితే తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి మృతి

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీకి చెందిన హబీబ్(60) ఆర్థిక ఇబ్బందులతో గత నెల 27న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపారు.

సింగరేణిలో దళారీకి ఈ 'సారీ'..

- 'మెడికల్ బోర్డు' నగదు తిరిగివ్వాలని ఆందోళన
- ఇంటికి తాళం వేసి ఉడాయించిన సదరు నేత!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి మెడికల్ బోర్డు పేరుతో జరుగుతున్న మరో అవినీతి వ్యవహారం శుక్రవారం వెలుగు చూసింది. సింగరేణి వ్యాప్తంగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల గుర్తింపు, వారి పిల్లలకు కారుణ్య నియామకాల కోసం ఫిబ్రవరిలో యాజమాన్యం మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించింది. దీంతో కొత్తగూడెం మున్సిపాలిటీలో కీలకంగా ఉన్న ఓ నేత సోదరుడు రంగంలోకి దిగాడు. కాంట్రాక్టరుగా పని చేస్తున్న సదరు వ్యక్తి గతంలోనూ మెడికల్ బోర్డు పేరుతో మోసాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనికి తగ్గట్టుగానే తాజా కారుణ్య నియామకాల్లోనూ మీకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తానంటూ కొందరు కార్మికుల నుంచి రూ. 5 నుంచి రూ.10 లక్షల వరకు వసూళ్లు చేసినట్టు తెలుస్తోంది. అయితే ఇటీవల జరిగిన మెడికల్ బోర్డులో సదరు కాంట్రాక్టరు పాచిక పారలేదు. వారిని అన్‌ఫిట్‌గా ప్రకటిస్తూ, వారి పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చేందుకు మెడికల్ బోర్డు నిరాకరించింది. దీంతో వారంతా మెడికల్ బోర్డు కోసం డబ్బులు సమర్పించుకున్న నేత వద్దకు వెళ్లారు. 'పని జరగలేదు కాబట్టి మా డబ్బులు మాకు ఇవ్వాలి' అంటూ సింగరేణి ప్రధాన ఆస్పత్రి సమీపంలో ఉన్న ఆ నేత ఇంటి ముందు బైఠాయించారు. హడలెత్తిపోయిన సదరు కాంట్రాక్టరు ఇంటికి తాళం వేసి అక్కడి నుంచి ఉడాయించాడు. మెడికల్ బోర్డు జరిగిన ప్రతిసారీ అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

క్లుప్తంగా...



ఉత్తమ పవర్ ప్లాంటుగా ఎస్టీపీపీ

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) సంస్థ ఉత్తమ పవర్ ప్లాంటు నిర్వహణలో భాగంగా ఎస్టీపీపీకి ఈ అవార్డును అందించింది. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ చేతుల మీదుగా సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు అందుకున్నారు. కాగా, ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో వరుసగా అవార్డులు అందుకోవడం విశేషం.

తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా అన్నమనేని

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అన్నమనేని సుధాకరరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా నర్సింగరావులను నియమిస్తున్నామని ఆ సంఘం ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గంపా నాగేందర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మిల్లింగ్ ప్రక్రియ, బియ్యం పరిశ్రమపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తిగా.. పరిశ్రమకు.. ప్రభుత్వానికి మధ్య వారధిగా సుధాకరరావు పనిచేస్తారని అభిప్రాయపడ్డారు.

'జూన్‌కల్లా రోడ్ల మరమ్మతులు పూర్తి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలా కాలం తర్వాత పీరియాడికల్ రెన్యువల్ పనులలో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర రహదారుల మరమ్మతులను జూన్‌కల్లా పూర్తి చేయాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ పనులపై శుక్రవారం ఆయన రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, ప్రత్యేక కార్యదర్శి విజేంద్ర బోయి, ఈఎన్సీ రవీందర్‌రావులతో సమీక్షించారు. రూ.2875 కోట్లతో చేపట్టిన మొత్తం 1170 పనుల్లో 232 పనులు పూర్తి కాగా, మిగతా వాటిని వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల నిర్వహణ బాధ్యతను 60 ఏజెన్సీలకు అప్పగించినందున, ప్రతి ఏజెన్సీ వారానికి కనీసం ఒక్క పనైనా పూర్తి చేసేలా చూడాలని సూచించారు.

ఇక మొబైల్ ఆస్పత్రులు!

సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై దృష్టి
- మారుమూల పల్లెవాసులకూ మెరుగైన వైద్యానికి ప్రణాళిక
- పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎంపిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని మారుమూల ఆదివాసీ, గిరిజన పల్లెల్లో నివసించే వారికి మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మొబైల్ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వాటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

కదిలే ఆస్పత్రి...

మొబైల్ క్లినిక్‌గా తీర్చిదిద్దే వాహనంలో రోగనిర్ధారణ పరీక్షలు, ఔషధాలు, మైనర్ సర్జరీలు చేసేందుకు అనువైన వ్యవస్థ, రెండు బెడ్లు, టాయిలెట్ సదుపాయం ఉంటాయి. ఈ వాహనంలో ఒక డాక్టర్, ఒక ఏఎన్ఎం, ఒక మిడ్‌వైఫరీ, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఉంటారు. దీంతోపాటు టెలిమెడిసిన్ వ్యవస్థకు అనువైన సమాచార వ్యవస్థ సైతం అందుబాటులో ఉంటుంది. ఎంపిక చేసిన మండలాల్లో పల్లె దవాఖానాలకు దూరంగా ఉన్న గ్రామాలు, గిరిజన గూడేలకు వారంలో రెండు, మూడుసార్లు రోడ్డు మార్గంలో వీలైనంత దగ్గర వరకు ఈ మొబైల్ క్లినిక్ చేరుకుంటుంది. అక్కడి ప్రజల ఆరోగ్య స్థితిగతులను వైద్యుడు, ఇతర సిబ్బంది పరిశీలించి తగిన మందులు అందిస్తారు. ప్రసవ సమయం దగ్గర పడిన నిండు గర్భిణులతో పాటు ఇతర అత్యవసర వైద్యం అవసరమైన వారిని గుర్తించి ముందుగానే పెద్దాస్పత్రులకు వాహనంలో తరలిస్తారు. మొబైల్ క్లినిక్‌ల వల్ల మారుమూల ప్రాంతాలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

భద్రాద్రి జిల్లాలో

మావోయిస్టు ప్రాభావిత ప్రాంతాల్లో వెనుకబాటుతనం రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏళ్లుగా భారీ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఏజెన్సీ ఏరియాల్లో రవాణా, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా వైద్యసేవలు సైతం వారి చెంతకు చేర్చే పనికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటెలిజెన్స్ నోడల్ అధికారి ప్రభాకర్ చర్చించారు. జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో మొబైల్ ఆస్పత్రులు ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ రెండు మండలాల్లో వైద్య సేవలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లోని గూడేల ఎంపిక, రూట్ మ్యాప్ ఎంపికపై కసరత్తు ప్రారంభించారు.

రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక..

రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అక్కడి అటవీ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలకు దూరంగా అనేక గిరిజన గూడేలు ఉన్నాయి. దీంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప సాధారణ పరిస్థితుల్లో వైద్యసేవల కోసం ప్రయత్నాలు చేయడం లేదు. ఫలితంగా పురిటి నొప్పులతోపాటు ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. కానీ రోడ్లు సరిగ్గా లేకపోవడంతో '108'వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో మంచాలు, డోలీలు, కుర్చీల్లో రోగులను ప్రధాన రహదారుల వద్దకు మోసుకెళ్లి అక్కడి నుంచి వాహనంలో ఆస్పత్రులకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రజల వద్దకే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు మొబైల్ ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురానున్నారు.


రోగులను మంచంపై ఆస్పత్రికి తీసుకొస్తున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలు (ఫైల్)

232 కోట్లు ఎగ్గొట్టి 'పరుగులు'!

మొదటి పేజీ తరువాయి

అన్ని ప్రాంతాలకు చెందిన రవాణా వాహనాలను తనిఖీ చేయాలని లక్ష్యాలను నిర్దేశించారు.

గ్రేటర్‌లో ఆటోలు మినహా...

సాధారణంగా వ్యక్తిగత వాహనాలకు ఒకసారి జీవితకాల పన్ను చెల్లిస్తే చాలు. కానీ రవాణా వాహనాలకు మాత్రం ప్రతి 3 నెలలకోసారి త్రైమాసిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వాహనాల సామర్థ్యం మేరకు దీనిని నిర్ణయిస్తారు. వెయిట్ గ్రాస్ వెహికల్ (డబ్ల్యూజీవీ) ప్రకారం వాహనం బరువుకు అనుగుణంగా త్రైమాసిక పన్ను కనిష్టంగా రూ. 535 నుంచి గరిష్టంగా రూ. 15,000 వరకు ఉంటుంది. గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు జీహెచ్ఎంసీలోని సుమారు 1.4 లక్షల ఆటోలను ఈ త్రైమాసిక పన్ను జాబితా నుంచి ప్రభుత్వం మినహాయించింది. మిగతా అన్ని రకాల రవాణా వాహనాలు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ జాబితాలో స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులు, లారీలు, క్యాబ్‌ల వంటి వాహనాలు ఉన్నాయి. కోవిడ్ కాలంలో పన్ను చెల్లించని రవాణా వాహనదారులు... కోవిడ్ ఆంక్షలను సడలించాక చాలా వరకు చెల్లించారు. కొందరు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆర్టీఏ అధికారులు అప్పట్లో ఉదారంగా వ్యవహరించడం కూడా ఇందుకు కారణమైంది.

ఎంవీఐలకు పన్ను వసూలు టార్గెట్‌లు!

ఈ నెలాఖరు నాటికి బకాయిలు వసూలు చేయాలని రవాణా కమిషనర్ అధికారులను మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. అలాగే వారికి టార్గెట్‌లు విధించారని తెలియవచ్చింది. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతి ఎంవీఐకి రూ. 6 లక్షల చొప్పున టార్గెట్ విధించగా ప్రస్తుతం దాన్ని రూ. 7 లక్షలకు పెంచారని సమాచారం. ఈ లెక్కన ఆర్టీఏ కార్యాలయాల్లో పౌరసేవలు అందించే ఎంవీఐలు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోజుకు పన్ను చెల్లించని 5 వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో ఉన్నవారు రోజుకు 10 వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయితే జప్తు చేసిన వాహనాలను నిలిపేందుకు సరైన పార్కింగ్ సదుపాయం లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఓ ఎంవీఐ పేర్కొన్నారు.

బ్లాంక్ డీడీలతో దళారుల వసూళ్లు

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సీజ్ చేసిన వాహనాలపై పెనాల్టీతో సహా కట్టాల్సిన బకాయిల మొత్తానికి డీడీ తీసుకురావాలని అధికారులు చెబుతుండటంతో దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. వారు అప్పటికే వివిధ మొత్తాలతో బ్యాంకుల నుంచి తెచ్చిన ఖాళీ డీడీలు చూపి ఒక్కో డీడీపై 'సర్వీస్ చార్జీ'గా రూ.200 వసూలు చేస్తున్నారు. దీంతో ఆరొందల నుంచి రూ.1200 వరకు ఆ రూపంలో అదనపు భారం పడుతోంది. కళ్లముందే ఈ దందా జరుగుతున్నా రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవట్లేదు.

స్వచ్ఛందంగా ముందుకొస్తేనే ఊరట...

త్రైమాసిక పన్ను పెండింగ్ జాబితాలో ఉన్న వాహన యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్ను చెల్లిస్తే అపరాధ రుసుము ఉండదని అధికారులు చెబుతున్నారు. తనిఖీల్లో పట్టుబడితే మాత్రం 200 శాతం వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

'షా'రొస్తున్నారు..!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించనున్నారని పేర్కొన్నాయి.

ఇప్పటికే కర్ణాటకలో షురూ..

కర్ణాటకలో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది. అయితే కొంతకాలం నుంచి కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందన్న అభిప్రాయం ఉంది. దీనికితోడు రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీ కాస్త పుంజుకుందన్న అంచనాలూ వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన బీజేపీ.. ఆ రాష్ట్రంలో పార్టీని విజయతీరాలకు చేర్చే బాధ్యతను అమిత్‌షాకే అప్పగించింది. గత ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీకి పూర్తి మెజారిటీ దక్కకపోవడానికి నేతల మధ్య కుమ్ములాటలు, సమన్వయం లేకపోవడమే ముఖ్య కారణమని గుర్తించిన నాయకత్వం.. ఈసారి ఆ సమస్య పునరావృతం కాకుండా అమిత్‌షా నేతృత్వంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆ రాష్ట్రంలో యావత్ ఎన్నికల వ్యూహ రచన ఆయన కనుసన్నల్లోనే సాగుతోంది. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో.. అక్కడే ఇల్లు అద్దెకు తీసుకుని, పూర్తి సమయం కేటాయించేందుకూ అమిత్‌షా సిద్ధమవుతున్నారు. కర్ణాటకలో ఎన్నికలు ముగిశాక.. అదే తరహాలో తెలంగాణపైనా దృష్టి పెట్టనున్నారు.

ఇప్పటికే పరోక్షంగా పర్యవేక్షణ

అమిత్‌షా ఇప్పటికే పరోక్షంగా రాష్ట్ర పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడి రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్ సర్కార్ తీరు, సీఎం కేసీఆర్ వ్యవహారశైలి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తున్నారు. పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాలన్నీ ఆయన అదుపాజ్ఞలు, పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయని పార్టీ నేతలు చెప్తున్నారు. ఈ క్రమంలోనే అమిత్‌షా, ఇతర అగ్రనేతలు కలసి.. గతంలో లోక్‌సభ, యూపీ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషిచేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌ను రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం బన్సల్ నేతృత్వంలోనే 'ప్రజాగోస–బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ సంస్థాగత పటిష్టత, బూత్ సశక్తికరణ్ అభియాన్ వంటివి చేపడుతున్నారు. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఐదు విడతల్లో చేపట్టిన పాదయాత్రతో దాదాపు సగం అసెంబ్లీ నియోజకవర్గాలు కవర్ అయ్యాయి. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో పాదయాత్రలు కాకుండా.. రాష్ట్రంలోని నాలుగైదు రూట్లలో ముఖ్యనేతలంతా సమాంతరంగా పాల్గొనేలా రథయాత్రలు నిర్వహించాలనే ఆలోచనతో ఉన్నట్టు పార్టీ నేతల సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే జాతీయ నాయకత్వం ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

ఏప్రిల్‌లో లోక్‌సభ సీట్లలో రథయాత్రలు

ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఐదు రూట్లలో రథయాత్రలు నిర్వహించాలని ఇటీవల అమిత్‌షా సూచించినట్టు తెలిసింది. దీనితోపాటు ఏప్రిల్ మొదటి వారంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల వారీగా రథయాత్రలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు ఎంపీ స్థానాల్లోని ఒక్కో అసెంబ్లీ స్థానం పరిధిలో ఒక్కో రోజు ఈ యాత్రలు సాగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఇక చేరికలు వేగవంతం!

రాష్ట్రంపై అమిత్‌షా పూర్తిగా దృష్టి సారించనున్న నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరికలు ఇకపై వేగం పుంజుకుంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర పార్టీ కోర్‌కమిటీ సభ్యులతో భేటీ అయినప్పుడు కూడా అమిత్‌షా ఈ విషయంపై ఆరా తీసినట్టు తెలిసింది. వివిధ జిల్లాలు, నియోజకవర్గాల్లో ఇతర పార్టీల ముఖ్య నేతలు చేరకపోవడానికి కారణాలేంటి? ఎవరు అడ్డుపడుతున్నారు? వారి అభ్యంతరాలేమిటన్న దానిపై ఆయన నేతలను ప్రశ్నించినట్టు సమాచారం. తొలుత జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతలను చేర్చుకుంటే.. వారి వెంట అనుచరులు, కార్యకర్తలు తరలివస్తారని, పార్టీ బలోపేతం అవుతుందని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఏయే జిల్లాల నుంచి ఏ పార్టీల నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు? వారు డిమాండ్లు, విజ్ఞప్తులు ఏమిటన్న దానిపై రాష్ట్ర నేతల నుంచి విడివిడిగా జాబితాలు తీసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో త్వరలోనే చేరికలు ఊపందుకుంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

సమన్వయం కోసం విందు భేటీలు!

రాష్ట్రంలో ప్రతి పదిహేను రోజులకోసారి కోర్ కమిటీ భేటీ నిర్వహించాలని కొన్నినెలల కింద జాతీయ నాయకత్వం ఆదేశించింది. ముఖ్య నేతల మధ్య సమన్వయం, అభిప్రాయాలు పంచుకోవడానికి, కార్యక్రమాల నిర్వహణపై సూచనల కోసం భేటీలు ఉపయోగపడతాయని భావించింది. కానీ అనుకున్నట్టుగా కోర్ కమిటీ భేటీలు జరగడం లేదు. ఇటీవలి ఢిల్లీ భేటీలో దీనిపై ప్రశ్నించిన అమిత్‌షా.. వారానికి ఒకరోజు నేతల నివాసాల్లో బ్రేక్‌ఫాస్ట్, లంచ్ లేదా డిన్నర్ భేటీలు నిర్వహించి, కలుసుకుంటూ ఉండాలని సూచించినట్టు తెలిసింది. ఈటల రాజేందర్ నివాసంలో సమావేశంతో ఇలాంటి విందు భేటీలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నట్టు సమాచారం. అమిత్‌షా రంగంలోకి దిగనుండటంతో ఇకపై వరుసగా విందు భేటీలు, సమావేశాలు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

జిల్లా వార్తలు

యూసీపీఈలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రారంభం


యూనిట్‌ను ప్రారంభిస్తున్న కోఆర్డినేటర్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల(యూసీపీఈ)లో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రారంభమైంది. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ.నారాయణ మాట్లాడారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ సీహెచ్.రవికుమార్, ప్రొఫెసర్ కె.రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పి.కోటి, పి.మధు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఇల్లెందు నియోజకవర్గం బయ్యారంలో ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించడంతో పాటు సత్తుపల్లిలో కార్యక్రమాలకు హాజరవుతారని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

వినయ్‌కు రూ.5వేల ఆర్థిక సాయం

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేట: దమ్మపేట మండలం మందలపల్లి సాంఘిక సంక్షేమ గురుకులంలో సైన్స్ ఫేర్ ఏర్పాట్లు చేస్తుండగా యాసిడ్ బాటిల్ పగిలి తీవ్రంగా గాయపడిన ఆరో తరగతి విద్యార్థి వినయ్ పరిస్థితిపై శుక్రవారం 'సాక్షి'లో 'అయ్యో వినయ్.. సాయం చేసే వారే లేరా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అశ్వారావుపేట మండలం అచ్యుతాపురానికి చెందిన జూపల్లి కోదండ రామారావు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నగదును ఆయన తండ్రికి పంపించినట్లు తెలిపారు.

తపాలా మహామేళాలో అగ్రగామి

- ఖమ్మం డివిజన్‌లో అత్యధిక ఖాతాలు
- 21,214 మందితో ఖాతాలు తెరిపించిన అధికారులు

మహామేళాలో తొలి ఐదు స్థానాలు సాధించిన డివిజన్లు

డివిజన్	ప్రారంభించిన ఖాతాలు
ఖమ్మం	21,214
ఆదిలాబాద్	14,109
కరీంనగర్	13,099
పెద్దపల్లి	11,069
నిజామాబాద్	10,852


ఖమ్మంలోని పోస్టల్ శాఖ కార్యాలయం

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ దేశవ్యాప్తంగా నిర్వహించిన పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంక్ మహామేళాలో తెలంగాణ సర్కిల్‌లోనే అత్యధిక ఖాతాలు తెరిపించడం ద్వారా ఖమ్మం డివిజన్ ప్రథమస్థానంలో నిలిచింది. గతనెల 20 నుంచి 28వ తేదీ వరకు తపాలా శాఖ పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంక్ మహామేళా నిర్వహించింది. ఈ మేళాలో ఖమ్మం డివిజన్ నుంచి 21,214 మందితో కొత్తగా అకౌంట్లు తెరిపించారు.

పది సబ్ డివిజన్లు.. 823 పోస్టాఫీసులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది సబ్ డివిజన్లలో ఉన్న 823 తపాలా కార్యాలయాల ద్వారా మహామేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఖమ్మం నార్త్ సబ్ డివిజన్ అత్యధికంగా 3,420 అకౌంట్లతో ప్రథమ స్థానంలో నిలవగా, మధిర సబ్ డివిజన్‌లో 3,123, ఖమ్మం ఈస్ట్ సబ్ డివిజన్‌లో 2,687 అకౌంట్లు తెరిపించి ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఇటీవల నిర్వహించిన పోస్టల్ పథకాల మహామేళాలోనూ తెలంగాణ సర్కిల్‌లో ఖమ్మం డివిజన్ అగ్రస్థానంలో నిలిచిన విషయం విదితమే. ఇప్పుడు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ల మహామేళాలో కూడా ఖమ్మం డివిజన్ తెలంగాణ సర్కిల్‌లో సత్తా చాటడం విశేషం. కాగా, దేశవ్యాప్తంగా మొత్తం 24 పోస్టల్ సర్కిళ్లు ఉండగా తెలంగాణ సర్కిల్ 1,52,833 ఖాతాలతో ఐదో స్థానంలో నిలిచింది.

ఉద్యోగుల కృషితోనే...

మహామేళాలో ఉద్యోగుల కృషితో ఖమ్మం డివిజన్ తెలంగాణ సర్కిల్‌లోనే అగ్రస్థానం నిలిచింది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యాన వడ్డీ రేట్లు అధికంగా ఉన్న తపాలా సర్వీసులను ప్రజలు వినియోగించుకోవాలి. ఖాతాలు, డిపాజిట్ల వివరాలను నేరుగా శాఖ కార్యాలయాలు, పోస్ట్‌మ్యాన్, జీడీఎస్ సిబ్బంది వద్ద కానీ, పోస్ట్ ఇన్ఫో, యాప్‌ల ద్వారానైనా తెలుసుకోవచ్చు.

– బి.రవికుమార్, ఖమ్మం డివిజన్ తపాలా సూపరింటెండెంట్

హైదరాబాద్‌లో ఖమ్మం వ్యాపారుల నిరసన


కేంద్ర జీఎస్టీ అధికారులతో మాట్లాడుతున్న ఖమ్మం వ్యాపారులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్లపై కేంద్ర జీఎస్టీ శాఖ పన్ను చెల్లించాలని నోటీసులు ఇవ్వడంపై ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు శుక్రవారం హైదరాబాద్‌లోని కేంద్ర జీఎస్టీ కమిషనర్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అన్నిరకాల పంటల అమ్మకంపై జీఎస్టీ విధానాన్ని అమలుచేస్తుండగా, పత్తి కొనుగోళ్లపై కూడా పన్ను విధించడం సరికాదని ఆరోపించారు. ఇప్పటికే ఖమ్మం వ్యాపారులు పన్ను చెల్లించాలని నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెట్టడంసరికాదని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయంలో సహాయ కమిషనర్లతో వ్యాపారులు భేటీ తమ సమస్యలను వివరించారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావుతో పాటు పాటు జీ.వై.నరేష్, మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, నల్లమల ఆనంద్, నల్లమోతు లక్ష్మయ్య పాల్గొన్నారు.

రామయ్య శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు రశీదు అందచేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళం అందచేశారు. రామాంత్‌పూర్‌కు చెందిన మునుగుల నారాయణరావు, నాగేంద్రమ్మ, వెంకటరామయ్య రూ.1.40లక్షలను ఆలయ అధికారులకు అందచేసి స్వామి వారిని సందర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న వసంతోత్సవం, డోలోత్సవం

ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని రామాలయంలో ఈనెల 7న వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. అలాగే, శ్రీరామనవమి పనుల్లో భాగంగా పసుపు కొమ్ములు దంచి, తలంబ్రాలను కలిపే పనులు మొదలుపెడతామని పేర్కొన్నారు. దీంతో 7వ తేదీన స్వామి వారి నిత్యకల్యాణాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఢిల్లీ కిసాన్ మేళాలో టేకులపల్లి బృందం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 12వ డివిజన్‌లోని టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షకసేవా సహకార సంఘం బృందం సభ్యులు ఢిల్లీలోని కృషి విజ్ఞాన కేంద్రంలో భారత వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటు చేసిన మేళాలో పాల్గొన్నారు. చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, ఎండీ సాకేత్‌కుమార్‌తో పాటు డైరెక్టర్లు అక్కడి మేళాలో వివిధ పంటల సాగు విధానం, మేలు రకం విత్తనాలు, సాగుకు ఉపయోగపడే ఆధునిక పరికరాలను పరిశీలించి ఉపయోగాలను తెలుసుకున్నారు. డైరెక్టర్లు లింగా నాగార్జున, మన్నెపల్లి రవి, రావెళ్ల కిషన్, ఇనప రాంబాబు, వాకదాని రాంనారాయణ, కుర్రా భాస్కరరావు, బి.ఉపేందర్, పొన్నం వెంకటరమణ, రేపాకుల రవి తదితరులు పాల్గొన్నారు.


స్టాల్‌లో డ్రోన్‌ను పరిశీలిస్తున్న సంఘం సభ్యులు

పది జీపీఏ సాధించేలా సిద్ధం కండి


ఎస్సెస్సీ విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ

దుమ్ముగూడెం: రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు పది జీపీఏ సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రియాంక సూచించారు. దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అలాగే, విద్యార్థులు ఆరోగ్యం, మెనూపై శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షల సమయాన ఒత్తిడికి గురికాకుండా సిద్ధం చేయాలని తెలిపారు. డీడీ వెంట ఐటీడీఏ అధికారులు తెల్లం రమణయ్య, రూపాదేవి, పూనం నరసింహారావు, హెచ్ఎంలు మడకం మోతీరు, సర్వేశ్వర్ దొరతో పాటు హరికృష్ణ, కె.పార్వతి, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, ఆంజనేయులు, బోడియ, సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, చెన్నారావు, లక్ష్మయ్య, కళ్యాణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో రక్షణ చర్యలు తప్పనిసరి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పాల్వంచ: కర్మాగారాల్లో పనిచేసే సమయాన ఉద్యోగులు, కార్మికులు రక్షణ చర్యలు తప్పక పాటించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాజగోపాల్ సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారాల్లో సీఈ ఎం.ప్రభాకర్ రావు ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో రాజగోపాల్ మాట్లాడుతూ కర్మాగారాల్లో పనిచేసే వారు చైతన్యవంతులై నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు జరగవని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.వెంకన్న, అధికారులు సీహెచ్.నితిన్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, జీ.వీ.ధర్మారావు, పి.కృష్ణ, పి.రామారావు, సి.జంగయ్య, ఎస్.నాగయ్య, వై.శ్రీనివాసరావు, భాగం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం స్టేషన్‌లో అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్

ఎంపీ నామకు రైల్వే జీఎం జైన్ లేఖ


ఖమ్మంలో స్టేషన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ నామ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ పథకం కింద వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావుకు శుక్రవారం రాసిన లేఖలో తెలిపారు. దీంతో గతంలో పలుమార్లు ఖమ్మం స్టేషన్‌లో చేపట్టాల్సిన పనులను ఎంపీ రాసిన లేఖలు, చేసిన సూచనలతో కదలిక వచ్చినట్లయింది. ఈమేరకు ఇప్పటికే స్టేషన్‌లో ఏర్పాటుచేసిన ఎస్కలేటర్లను త్వరలోనే ప్రారంభించనుండగా, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీఎం తెలిపారు. ఇప్పటికే ఉన్న ఎనిమిది సీసీ కెమెరాలకు తోడు నిర్భయ నిధుల కింద అదనంగా 60 సీసీ కెమెరాలు, ప్లాట్‌ఫారంలపై అదనంగా అంబరిల్లా పనులు, నాలుగు ఆటోమేటిక్ వాటర్ వెండింగ్ యంత్రాలు, మహిళల కోసం ప్రత్యేక వెయిటింగ్ హాల్, గార్డెనింగ్, ప్లాంటేషన్ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

'తొలిమెట్టు' ప్రగతిని పరిశీలించిన రాష్ట్ర బృందం

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమ అమలును శుక్రవారం రాష్ట్ర పరిశీలక బృందం తనిఖీ చేసింది. బృందం కన్వీనర్ యానాల వెంకటరెడ్డి, రాష్ట్ర పరిశీలకులు బాలమురళి కూసుమంచిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు కూసుమంచి, జీళ్లచెరువు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక వారు మాట్లాడుతూ విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వారి ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రవికుమార్, ఎంఈఓ బీ.వీ.రామాచారి పాల్గొన్నారు.